

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్ గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## భూమిక

**భాష:** హిందీ, కథ, స్క్రీన్‌ప్లే:శ్యాం బెనగల్, స్క్రిప్ట్ :గిరీష్ కర్నాడ్, సత్యదేవ్ దుబే;
సంగీతం - వనరాజ్ భాటియ; నటీనటులు - స్మితాపాటిల్, అనంత్ నాగ్, అమోల్ పాలేకర్,
నసీరుద్దీన్ షా, అమ్రిష్ పురి, కులభూషన్ ఖర్బందా
**విడుదల:** 1976




**ఆమె జీవితాన్ని ప్రేమించింది.** ప్రేమకోసం తపించింది. గాఢమయిన ప్రేమకోసం ఆమె జీవితాంతం పరుగులు తీసింది. కాని ఆమె ఆశించినంత గొప్ప ప్రేమ, గొప్ప ఆలంబన ఆమె జీవిత యాత్రలో తారసపడలేదు. కాని సినిమా తెరపైన మెరుపులు మెరిపిస్తూ అసలు జీవితంలో అనంతమయిన దుఃఖాన్ని ఒంటరి తనాన్ని, నిరాశ నిస్పృహల్ని తోడుగా చేసుకుని గడ్డిపరకలాంటి ఆలంబన లభించినా ఆశగా, ఉద్వేగంగా అందుకుంది. కాని ఆమె ఆశలకు, స్వేచ్ఛాభిలాషకు, వాస్తవ అనుభవానికి మధ్య అగాధంలాంటి అంతరంతో ఆమె తన జీవితాన్ని గడిపింది. ఇదంతా ఏదో కథలోనో, నవలలోనో జరిగింది కాదు. ఇది ప్రముఖ నటి హన్సావాడేకర్ జీవితంలో అనుభవించిన యదార్థం. ఆమె గురించి ఎంతోమంది మరెంతో రాశారు. ఆమె ఇల్లూ, ఆమె జీవించిన పరిసరాలూ పరిశీలించి రీసెర్చ్ చేసి ఆమె జీవితాన్ని గురించి ఎన్నో

కథలు రాశారు. అయితే హన్సావాడేకర్ ఆత్మకథ 'సంగ్తే ఆమ్కా' లోంచి మౌళిక కథాంశాన్ని తీసుకుని శ్యాంబెనగల్ 'భూమిక' చిత్రాన్ని 1976లో నిర్మించారు. అది సరిగ్గా హన్సా ఆత్మను ప్రతిఫలించలేదు. కాని అత్యంత నిజాయితీగా ఆమె జీవితాన్ని చిత్రబద్ధం చేసే విషయంలో మాత్రం గొప్ప విజయాన్ని సాధించింది. ఇక హన్సాపాత్రని ఉషగా స్మితాపాటిల్ అత్యద్భుతంగా పోషించింది. ఒక నటి యదార్ధ జీవితాన్ని తెరపైన ఆవిష్కరించడంలో స్మితాపాటిల్ మరచిపోలేని మందస్మిత వదనంతో నటించింది. ఉష పాత్రలో కాలానుగుణంగా, అనుభవాల పర్యవసానంగా పెల్లుబికిన భావావేశాల్ని, పలికించడంలో స్మితాపాటిల్ అద్వితీయమైన నటనని ప్రదర్శించారు. గిరీష్ కర్నాడ్, సత్యదేవ్ దుబేలురచన చేసిన ఈ సినిమాకి పనిచేసినవాళ్ళంతా మహామహులే.



ఒక యదార్ధ కథను ఆధారం చేసుకుని ఓ స్త్రీ అంతరంగ జీవితాన్ని, అనుభవాల పరంపరని అల్లిక చేసి దృశ్యకావ్యంగా మలచడంలో శ్యాం బెనగల్ పరిమళంతో కూడిన ప్రతిభని కనబర్చారు. 'భూమిక'కు బలం చిత్రకథాంశమూ, ముఖ్యనటి స్మితాపాటిల్ నటన కాగా, వాటిని ప్రతిభావంతంగా నిలబెట్టడంలో శ్యాం బెనగల్ అవగాహన, ప్రతిభ ప్రతి ఫ్రేంలో గోచరిస్తాయి. ముఖ్యంగా చలన చిత్రజీవితానికి సంబంధించిన అతి చిన్న చిన్న అంశాలు కూడా ఈ సినిమాలో బెనగల్ దృష్టినుంచి జారిపోలేదు. ప్రధానంగా మరాఠీ జీవితమూ, సినిమా రంగమూ గొప్ప నేపథ్యంగా ఈ సినిమాకి అండగా నిలిచాయి.

కథాంశం విషయానికి వస్తే 1920 ప్రాంతంలో ఓ కొంకిణి గ్రామం. ఉష తండ్రి తాగుబోతు. తల్లి తనను అమితంగా ఇష్టపడే ప్రియుడు కేశవ్ సహకారాన్ని పొందుతూ ఉంటుంది. ఉషకి ఆమె అమ్మమ్మ అన్నివిధాలా తోడుగా ఉంటుంది. ఆమె ఉషకి సంగీతం నేర్పిస్తుంది. అందమయిన యువతిగా ఎదిగిన ఉష సినీ రంగాన్ని చేరుతుంది. అందమూ, సంగీతమూ, నృత్యమూ, నటనా ప్రదర్శించడంలో ప్రతిభ గల ఉష అతి తక్కువ సమయంలోనే ప్రముఖ నటిగా ఎదుగుతుంది

ఆమె సహనటుడు రాజన్ ఆమెని ప్రేమిస్తాడు. కాని చిన్ననాటి నుంచి తనకూ తన కుటుంబానికి అనేక వివాదాల సహకరించిన కేశవ్‌ని ఉష పెళ్ళాడుతుంది. వారిద్దరికీ ఓ పాప పుడుతుంది. కాని కేశవ్ కొంతకాలానికే తన దుబారాతో పనికిరాని వ్యక్తిలా మారిపోయి భార్యనుంచి దూరమౌతాడు.

విచ్ఛిన్నమయిన కుటుంబ స్థితి కొంత, తను స్వేచ్ఛను ఆశించి కొంత ఉష క్రమంగా సినిమా దర్శకుడు సునీల్ వర్మకు దగ్గరవుతుంది. వారి సాన్నిహిత్యం మరింత దగ్గరయి ఉష గర్భవతికావడం అది అబార్షన్ కావడమూ జరిగిపోతాయి. అనంతరం ఇద్దరిమధ్యా పొరపొచ్చాలు లేచి ఇద్దరూ ఒకరినొకరు మోసగించారని ఆరోపించుకుంటూ విడిపోతారు. ఇంతలో ధనవంతుడయిన కాలె ఉషని చేరదీస్తాడు. తన భార్యస్థానాన్నిచ్చి గోవాలోని తన భవంతిలో ఉంచుతాడు. ఇక ఆమెకు ఆ ఇల్లే సర్వస్వంగా మారుతుంది. చివరికి భవంతి అవతలికి వెళ్ళేందుకు సైతం ఆమెకు స్వేచ్ఛ లేని స్థితి ఏర్పడుతుంది. ఆ స్వేచ్ఛ లేనితనాన్ని ఆమె అసలు భరించలేదు. విచిత్రమయిన పరిస్థితిలో తన మాజీ భర్త కేశవ్ సహకారంతో ఆమె అక్కడినుంచి పారిపోయి బాంబే చేరుతుంది. హోటల్ చేరిన ఆమె ముందర అనేకదారులు గోచరిస్తాయి. అప్పటికే ఎదిగిన ఉషకూతురు ఓ ధనవంతుణ్ణి పెళ్ళాడి సంతోషకరమయిన జీవితాన్ని గడుపుతూ ఉంటుంది. ఆమె తల్లికి సరిపడినంత ధనంతో పాటు స్వేచ్ఛగా జీవించే స్థితి కలిపిస్తానంటుంది. మరోవైపు సినీ నటుడు రాజన్ ఉషపట్ల తన ప్రేమనింకా దాచుకున్న స్థితిలో ఆమెకోసం ఏమయినా చేయడానికి ముందుకు వస్తాడు నటిగా వృత్తిపరంగా గాని, వ్యక్తిగా బతుకుపరంగా గాని రాజన్ సంపూర్ణంగా ఆమెకు సహకరించడానికి సిద్ధపడతాడు.

ఇంకోవైపు ఉష భర్త కేశవ్ తమ వైవాహిక జీవితాన్ని పునఃప్రారంబిద్దామంటాడు కాని ఉష వీటన్నింటినీ తోసి రాజంటుంది. తన ఇన్నేళ్ళ జీవితంలో ఏ స్వేచ్ఛ కోసమయితే, ఏ ప్రేమకోసమయితే పరుగులు తీసిందో దాన్ని ఫణంగా పెట్టి మరొకని పంచన

పడిఉండటానికి ఆమె అస్సలు అంగీకరించదు. వ్యక్తిగా, కళాకారిణిగా ఆమె తన అభీష్టానికి వ్యతిరేకంగా జీవించడానికి అంగీకరించదు. గొప్ప ఆర్తితో, తపనతో తన సర్వశక్తులు ఒడ్డి జీవితకాలమంతా సంఘర్షించిన ఉష జీవితం ముగింపును దర్శకుడు శ్యాంబెనగల్ అనేక బహిరంగ ప్రశ్నలతో వదిలేస్తాడు.

హన్సావాడేకర్ యదార్థ జీవితాన్ని ఆలంబనగా చేసుకుని 'భూమికను' రూపుదిద్దిన శ్యాంబెనగల్ స్త్రీ స్వేచ్ఛ గురించి సమాజంలో ఆమె భూమిక గురించి ఆమె చుట్టూరా ముసురుకుని ఉండే పురుష భావజాలం ఆమెను ఎంతగా వత్తిడికి గురిచేస్తూ ఉందో సవివరంగా చూపించి కళాత్మకంగా వివరిస్తాడు. చిత్రంలో ఉష పాత్రలో స్మితాపాటిల్ నటన అద్వితీయమయింది. భావావేశాల్ని, ఉద్రేకాన్ని ప్రదర్శించడంలో స్మితాపాటిల్ చూపిన ప్రతిభ ఎనలేనిది. గొప్ప నటి జీవిత చిత్రం 'భూమిక' భారతీయ చలనచిత్ర చరిత్రలో గొప్ప మైలురాయిగా మిగిలిపోతుంది.

✡✡✡

## 36 చౌరంఘీ లేన్

**భాష:** (ఇంగ్లీష్)
కెమెరా - అశోక్ మెహతా; సంగీతం - వన్ రాజ్ భాటియా; కథ స్క్రీన్‌ప్లే, దర్శకత్వం- అపర్ణా సేన్
**నటీనటులు:** జెన్నిఫర్ కెండాల్, ధ్రితిమాన్ చటర్జీ దేబశ్రీరాయ్, జఫర్ కెండాల్
**విడుదల:** 1981

**మహిళను ముఖ్యాభినేతగా** చేసి నిర్మించిన అనేక భారతీయ చలన చిత్రాల్లోకి అపర్ణాసేన్ దర్శకత్వంలో నిర్మితమైన '36 చౌరంఘీ లేన్' విశిష్టమయింది. దేశ విదేశీ సినీ విమర్శకుల చేత గొప్ప ప్రశంసలు అందుకుంది.




ఈ చిత్రం 1981లో ఇంగ్లీషులో నిర్మితమయింది. ఇందులో వయసు మళ్ళుతున్న ఓ ఆంగ్లో ఇండియన్ మహిళ యొక్క చేతన, అంతః చేతనల్లోని ఆశలు, అవగాహనలు వాస్తవ జీవితంలో ఆమె అనుభవించే ఒంటరితనమూ, తోడు కోసం, కంపెనీ కోసం వ్యథ చెందే ఆమె మానసిక స్థితి ప్రతిభావంతంగా ఆవిష్కృతమవుతాయి.

అప్పటిదాకా నటిగా లబ్ధప్రతిష్ఠురాలయిన అపర్ణాసేన్ '36 చౌరంఘీలేన్'తో తన చలనచిత్ర యాత్రను మలుపుతిప్పారు. ఆమె ఈ చిత్ర కథను కథనాన్ని తాజాగానూ వినూత్నంగానూ చిత్రీకరించారు. సుప్రసిద్ధ సినీ విమర్శకుడు చిదానంద దాస్ గుప్తా కుమార్తె అయిన అపర్ణాసేన్ తనకు వారసత్వంగా అందిన పరిజ్ఞానానికి తోడు గొప్ప చిత్రాల అధ్యయనం ద్వారా అందుకున్న అనుభవాన్ని రంగరించి సినిమాలకు దర్శకత్వం నెరపడం ఆరంభించారు. ఆమె '36 చౌరంఘీలేన్'తో తన తొలిప్రయత్నంలోనే పాత్రల్ని వాటి మానసిక స్థితిని విశ్లేషిస్తూ చిత్రించారు. ముఖ్యంగా ఆంగ్లో ఇండియన్ అయిన వయోలెట్ స్టాన్ హోమ్ పాత్రను నడిపించడంలో దర్శకురాలి ప్రతిభ విలక్షణంగా గోచరిస్తుంది.

బ్రిటీష్ రాజ్యకాలం నాటి అవశేషాలుగా మిగిలిన ఆంగ్లో ఇండియన్ సంతతి యొక్క మానసిక స్థితిని అర్థం చేసుకోవడంలో అపర్ణాసేన్ విజయం సాధించారు. ఆ సంతతి అటు ఆంగ్లేయ, ఇటు భారతీయ సంస్కృతుల్లో దేన్నీ సంపూర్ణంగా అందిపుచ్చుకోలేని సందిగ్ధ అవస్థలో పడి పోయింది. బ్రిటిష్ వాళ్ళ ఆహార్యమూ, బాషా విధానాలనూ పాటిస్తూనే ఇటు భారతీయ వాతావరణంలో జీవించాల్సిన విచిత్రమయయిన స్థితిలో వారి జీవనం కొనసాగుతున్నది. తాము బ్రిటీష్ వాళ్ళమే అన్నంతగా వ్యవహరించినప్పటికీ అక్కడి వాళ్ళ చేత 'తమ వాళ్ళు' అనిపించుకోలేని దుస్థితి వారిది. ఇటు సంపూర్ణంగా భారతీయులతో కలిసిపోలేని స్థితి. ఇలాంటి సంక్లిష్టత మధ్య నివసించే ఆంగ్లో ఇండియన్లలో మహిళల పరిస్థితి మరింత సంక్షోభంతో కూడుకున్నది. అలాంటి ఒక మహిళను ప్రధాన పాత్రగా చేసుకుని నిర్మితమయిన చిత్రమే '36 చౌరంఘీలేన్'. దర్శకురాలు అపర్ణాసేన్ మొట్టమొదట నటిగా సత్యజిత్‌రే నిర్మించిన 'తీన్ కన్య' చిత్రంలో ఒక భాగమయిన 'సమాప్తి'లో ప్రధాన భూమికను పోషించారు. ఆ తర్వాత అనేక చిత్రాల్లో నటించినప్పటికీ గానుగెద్దులాగా మూస పాత్రలో నటించాల్సి రావడం ఆమెకు నచ్చలేదు. సృజనాత్మక ప్రయత్నం చేయాలనే అభిలాషతో దర్శకత్వం వైపు దృష్టి మరల్చారు. నవ్యతతో కూడిన చిత్రం కోసం ఆమె చేసిన ప్రయత్న ఫలితమే ఈ '36 చౌరంఘీలేన్'. మొదట స్క్రిప్ట్ పూర్తిచేసి దాని చిత్తు ప్రతిని సత్యజిత్‌రేకు చూపించారామె. ఆయనకది నచ్చింది. కాని పెట్టుబడి ఎవరు పెట్టాలనే ప్రశ్న ముందు కొచ్చింది. కలకత్తాలో ఎవరూ ముందుకు రాకపోవడంతో ఆమె బాంబేవైపు దృష్టి మరల్చారు. సరిగ్గా అదే సమయంలో కళాత్మకమైన చిత్రాల్ని నిర్మిచాలనే ఆలోచనలో శశికపూర్ ప్రయత్నిస్తున్నారు. ఆయన అపర్ణాసేన్ ప్రపోజల్‌ని అంగీకరించారు. శశికపూర్ భార్య జెన్నిఫర్ కపూర్ ఈ చిత్రంలో ముఖ్యపాత్రను పోషించడానికి ముందుకు వచ్చారు. చిత్ర నిర్మాణం ఇంగ్లీషులో ప్రారంభమయింది.



ప్రధానగా నాలుగు పాత్రల చుట్టూ తిరిగే ఈ సినిమా కలకత్తా నగరాన్ని కేంద్రంగా తీసుకుని నిర్మితమైంది. ఇందులో అత్యంత ప్రధానమయిందీ, సంక్లిష్టమయిందీ ఆయన పాత్ర వయోలెట్ స్టోన్ హామ్. వయసు మళ్ళుతున్న ఆ ఆంగ్లో ఇండియన్ మహిళ కలకత్తాలోని ఒక స్కూలు లో షేక్స్‌ఫియర్ రచనల్ని బోధించే టీచర్‌గా పనిచేస్తూ ఉంటుంది. ఆమె తన పెంపుడు పిల్లితో కలిసి అపార్ట్‌మెంటులో ఒంటరిగా నివసిస్తూ ఉంటుంది. ఆమెకు గత స్మృతులు, అపుడపుడూ విదేశాల్లోని మిత్రులు, బంధువుల వద్దనుంచి వచ్చే ఉత్తరాలే ప్రధాన వ్యాపకం. ఆమె అన్న ఎడ్డీ కలకత్తాలోని ఓ వృద్ధ శరణాలయంలో నివసిస్తూ ఉంటాడు. ఓ క్రిస్‌మస్ రోజున వయోలెట్ చర్చికి వెళ్ళి తిరిగి వస్తూ ఉంటే ఆమెకు తన పూర్వ విద్యార్థిని నందిత కనిపిస్తుంది. ఆమెను ఆమె బాయ్ ఫ్రెండ్ సమరేశ్‌ను తన ఇంటికి కాఫీకి ఆహ్వానిస్తుంది వయొలెట్. మొదట కొంత మొహమాటపడ్డప్పటికీ ఆ ఇద్దరూ వయోలెట్ ఇంటికి వస్తారు. ఆమె చూపిన ఆదరణ ఆప్యాయత వారికి ఎంతో సంతోషం కలిగిస్తాయి. సమరేశ్ మదిలో ఓ ఆలోచన తలుక్కుమంటుంది. అప్పటిదాకా నందితను పార్కుల్లోనూ హోటళ్ళలోనూ కలిసిన తాను ఇక ముందు వయొలెట్ అపార్ట్‌మెంట్‌ని ఉపయోగించుకుంటే బావుంటుందని తలపోస్తాడు. తన నవలా రచన కోసం వయొలెట్ అపార్ట్‌మెంట్‌ను వినియోగించుకోవడానికి ఆమెను ఒప్పిస్తాడు. ఆ ఇద్దరి కంపెనీ వయొలెట్ కూడా ఆనందాన్నిస్తుంది. అప్పటిదాకా ఒంటరిగా ఉన్న వయొలెట్ తనవారితో ఉన్న సంతృప్తిని పొందుతుంది.

ఇంతలో వయొలెట్ పనిచేసే స్కూలులో పరిస్థితులు మారిపోతూ ఉంటాయి. అక్కడ వయొలెట్ స్థానంలో ఓ భారతీయ టీచర్‌ను నియమిస్తారు. చిన్నపిల్లలకి ఇంగ్లీషు గ్రామర్ చెప్పమని వయొలెట్‌కి సూచిస్తారు. ఆమె తీవ్ర మనస్తాపానికి గురవుతుంది,

మరోవైపు ఓల్డ్ ఏజ్ హోములో ఉన్న ఎడ్డి ఆరోగ్య పరిస్థితి మరింత క్షీణిస్తుంది. తోటి ఉపాధ్యాయులవల్ల నిరాదరణకు గురైన వయొలెట్‌ని ఎడ్డీ స్థితి మరింత సంక్షోభానికి గురిచేస్తుంది. ఆ స్థితిలో తన వాళ్ళనుకునే వారి అవసరాన్ని ఆమె అమితంగా ఫీలవుతుంది. ఒక రోజు పగలు ఇల్లు చేరిన వయొలెట్‌కి నందిత, సమరేశ్‌లు తన అపార్ట్‌మెంట్‌ను ఎందుకు ఉపయోగిస్తున్నారో తెలిసిపోతుంది. ఇంతలో ఎడ్డీ చనిపోతాడు. సమరేశ్‌కు ఉద్యోగం రావడంతో పెద్దవాళ్ళని ఒప్పించి నందిత, సమరేశ్ పెళ్ళాడతారు. పెద్దలు వారికి ఓ మంచి అపార్ట్ మెంట్‌ని పెళ్ళికానుకగా కొనిస్తారు. వారి జీవితం వారి ఆశల మేరకు సాగిపోతుంది. ఇక వారికి వయొలెట్ తో గానీ, ఆమె, అపార్ట్‌మెంట్‌తో గానీ అవసరముండదు. కాని వయొలెట్‌కి మాత్రం ఆ ఇద్దరి కంపెనీ ఎంతో అవసరమవుతుంది. వారు ఎప్పటిలాగే తన వద్దకు రావాలని ఆమె ఎంతో కోరుకుంటుంది. కాని వారు రారు. తమదైన జీవితంలో పడిపోతారు. ఎడ్డీ చనిపోయి స్కూలులో ప్రతికూల పరిస్థితులు ఎదురైన స్థితిలో వయొలెట్ నందిత, సమరేశ్‌లు కూడా దూరం కావడంతో తీవ్రమైన క్షోభకు గురౌతుంది. ఒంటరి తనంలో కూరుకుపోతుంది. మళ్ళీ క్రిస్‌మస్ వస్తుంది. వయొలెట్ నందిత, సమరేశ్‌లను టీకి ఆహ్వానిస్తుంది. కాని వారు తప్పించుకునేందుకు తాము ఊరెళుతున్నామని చెబుతారు. వయొలెట్ తీవ్ర నిరాశకు గురవుతుంది. వారికోసం కేకు తయారు చేసి వారి అపార్ట్ మెంట్‌లో ఇచ్చేస్తుంది. కేక్ చూసిన నందిత, సమరేశ్‌లు ఆశ్చర్యానందాలకు గురౌతారు. వయొలెట్ మాత్రం తీవ్ర నిరాదరణకు గురైనట్టుగా ఫీలయి వేదనతో ఇంటి ముఖం పడుతుంది. నిర్మానుష్యంగా ఉన్న కలకత్తా రోడ్డుపైన తనకిష్టమైన షేక్స్పియర్ రచనల్ని ఆలపిస్తూ ఆమె తన అపార్ట్‌మెంట్ వైపు కదులుతుంది. ప్రేమను పంచే ఓ స్త్రీ సహృదయతనీ, కలివిడిగా ఉంటూ కంపెనీని ఆశించే ఆమెను ఆమెలోని మంచితనాన్ని ఆశించినదానికి భిన్నంగా అనుభవంలోకి వచ్చిన ఒంటరితనపు స్థితిని ‘36 చౌరంఘీలేన్‘ గొప్పగా ఆవిష్కరించింది.




✡✡✡